క్లుప్తంగా

ఉదయగిరి డిపో మేనేజర్‌గా రమేష్



ఉదయగిరి: ఉదయగిరి ప్రజారవాణా సంస్థ డిపో మేనేజర్‌గా రమేష్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన విజయవాడలోని ప్రధాన కార్యాలయంలో పనిచేస్తూ డీఎంగా పదోన్నతి పొంది ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయగిరి డిపో అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించడమే తమ లక్ష్యమన్నారు.

ఉదయగిరి జిల్లా సాధనకు పోరాటం

ఉదయగిరి: ఉదయగిరి జిల్లా సాధనకు పోరాటం సాగిస్తామని మేకపాటి రాజమోహన్‌రెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు పేర్కొన్నారు. ఉదయగిరి జిల్లా సాధనకు మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట బుధవారం వారు నిరసన ప్రదర్శన చేపట్టారు. దశాబ్దాల కాలంగా ఉదయగిరి అభివృద్ధికి నోచుకోక అన్ని రంగాల్లో వెనుకబడి ఉందన్నారు. ఉదయగిరిని జిల్లా కేంద్రంగా చేస్తే మెట్టప్రాంతం ఎంతో అభివృద్ధి చెందుతుందన్నారు.

ఎంపీడీఓగా చెంచమ్మ



దుత్తలూరు: మండల నూతన ఎంపీడీఓగా ఎల్ చెంచమ్మ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈమె దగదర్తిలో ఈఓపీఆర్డీగా పనిచేస్తూ ఎంపీడీఓగా పదోన్నతి పొంది దుత్తలూరు వచ్చారు. నూతన ఎంపీడీఓను డిప్యూటీ ఎంపీడీఓ మల్లికార్జున, పంచాయతీ కార్యదర్శులు నజీముల్లా, కరీముల్లా శాలువాలతో సన్మానించారు.

ఆటో బోల్తా

• ఇద్దరికి గాయాలు

సీతారామపురం : : మండలంలోని అయ్యవారిపల్లి గ్రామ సచివాలయం సమీపంలో జాతీయ రహదారిపై బుధవారం సాయంత్రం ఆటో బోల్తా పడిన ఘటనలో ఇద్దరు గాయపడ్డారు. వివరాలు.. సీతారామపురం నుంచి అయ్యవారిపల్లి ఎస్సీ కాలనీకి వెళ్తున్న ఆటో అయ్యవారిపల్లి వద్ద ఒక్కసారిగా అడ్డొచ్చిన గేదెలను తప్పించబోయి బోల్తాపడింది. ఈ ఘటనలో అయ్యవారిపల్లి ఎస్సీ కాలనీకి చెందిన కోన ప్రభాకర్, సన్నాయి మాలి గాయపడ్డారు. క్షతగాత్రులను 108 వాహనంలో ఉదయగిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం కోన ప్రభాకర్‌ను మెరుగైన వైద్యం కోసం నెల్లూరు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రాజకీయ పార్టీల నేతలతో సమావేశం రేపు

ఉదయగిరి రూరల్: ఉదయగిరి నియోజకవర్గంలోని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నాయకులతో ఈ నెల 19న సమావేశం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ ఎల్ రామ్మోహన్ బుధవారం తెలిపారు. ఉదయగిరి తహసీల్దార్ కార్యాలయంలో జరిగే సమావేశంలో ఉదయగిరి నియోజకవర్గ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి ఏ మురళి పాల్గొంటారని చెప్పారు. ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులపై చర్చిస్తారని తెలిపారు.

గర్భిణులు పోషకాహారం తీసుకోవాలి

దగదర్తి/సీతారామపురం: గర్భిణులు పౌష్టికాహారాన్ని తీసుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ బ్రిజిత సూచించారు. స్వస్థ్ నారి శక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా దగదర్తి పీహెచ్‌సీలో బుధవారం ప్రత్యేక వైద్యశిబిరాన్ని నిర్వహించారు. డిప్యూటీ డీఎంహెచ్‌ఓ బ్రిజిత, దగదర్తి పీహెచ్‌సీ వైద్యాధికారి అఖిల్ రోగులకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆశాకార్యకర్తలకు వారి విధులపై అవగాహన కల్పించి ప్రతిజ్ఞ చేయించారు. అలాగే సీతారామపురం పీహెచ్‌సీలో వైద్యాధికారిణి స్వప్నరెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్యశిబిరం నిర్వహించారు.

50శాతం సబ్సిడీపై మినుము,పెసర విత్తనాలు

కలిగిరి: రైతులకు మినుము, పెసర విత్తనాలను 50 శాతం రాయితీపై అందజేస్తామని ఏఓ షేక్ జహీర్ తెలిపారు. తెల్లపాడులో బుధవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విత్తనాలు అవసరమైన రైతులు రైతుసేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కలిగిరి పీఏసీఎస్‌లో 13 టన్నులు, కుడుములదిన్నెపాడు పీఏసీఎస్‌లో 13 టన్నులు, కలిగిరిలోని మన గ్రోమోర్ కేంద్రంలో 18 టన్నుల యూరియా అందుబాటులో ఉందని తెలిపారు.

ఆర్సీఎం చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు



సీతారామపురం : స్థానిక అరుంధతీయవాడలోని ఆర్సీఎం చర్చిలో బుధవారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. క్రీస్తు జూబిలీ వేడుకల్లో భాగంగా దేవుని దివ్య సత్ప్రసాద ఆరాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. డీన్ ఫాదర్ బాల శౌరిరెడ్డి సందేశాన్ని అందించారు. విచారణ గురువు వరప్రసాద్, డీనరీ గురువులు పాల్గొన్నారు.

చినుకుపడితే చిత్తడే



అధ్వానంగా దువ్వూరు కోటేశ్వరాలయానికి వెళ్లే రోడ్డు



బురదమయంగా మక్తాపురం రోడ్డు

సంగం: మండలంలోని గ్రామీణ ప్రాంత రహదారులు ఏళ్లతరబడి అభివృద్ధికి నోచుకోక అధ్వానంగా తయారయ్యాయి. చిన్నపాటి వర్షం కురిసినా మట్టి రోడ్లు చిత్తడిగా మారుతున్నాయి. రోడ్లు బురదమయంగా మారి ద్విచక్ర వాహనాలపైన కాదు కనీసం నడిచి వెళ్లేందుకు కూడా వీల్లేకపోతుండడంతో ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని దువ్వూరు నుంచి కోటేశ్వరాలయానికి వెళ్లే దారి గుంతలతో నిండి వర్షం పడితే బురదమయంగా మారుతోంది. గుంతల్లో నీరు నిల్వ ఉండి కనిపించకపోతుండడంతో ద్విచక్ర వాహనదారులు అదుపుతప్పి గాయాలపాలవుతున్నారు. అలాగే మక్తాపురం గ్రామానికి వెళ్లే రహదారి అధ్వానంగా తయారైంది. వర్షం పడితే కనీసం నడిచి వెళ్లే పరిస్థితి కూడా లేక గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. అలాగే పలు గ్రామాలను కలిపే రోడ్లు అధ్వానంగా తయారవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

కూలితే ప్రాణాపాయమే



దుత్తలూరు: మండలంలోని దుత్తలూరు–నందిపాడు మార్గంలో 565వ జాతీయ రహదారి పక్కనున్న పొలాల్లో విద్యుత్ స్తంభం ప్రమాదభరితంగా ఉంది. స్తంభం పూర్తిగా వాలిపోయి ఏ క్షణాన్నైనా కూలిపోయేలా ఉండడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ సబ్‌స్టేషన్‌కు అతి సమీపంలోనే స్తంభం ఇలా ఉన్నా విద్యుత్ అధికారులు సమస్యను పట్టించుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఏదైనా ప్రమాదం జరగకముందే అధికారులు స్పందించి స్తంభాన్ని సరిచేయాలని రైతులు కోరుతున్నారు.

మండల సర్వసభ్య సమావేశం వాయిదా



నేలపై బైఠాయించి నిరసన తెలుపుతున్న ఎంపీటీసీ విజయమ్మ

ఉదయగిరి రూరల్: ఉదయగిరిలోని స్త్రీశక్తి భవనంలో బుధవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం కోరం లేక వాయిదాపడింది. పది మంది ఎంపీటీసీలకు గానూ కేవలం ముగ్గురు మాత్రమే సమావేశానికి హాజరవడంతో వాయిదా వేసినట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ సీహెచ్ పద్మజ తెలిపారు.

సీపీఎం ఎంపీటీసీ నిరసన

మండల సర్వసభ్య సమావేశాన్ని వాయిదా వేయడంపై సీపీఎం ఎంపీటీసీ సభ్యురాలు కాకు విజయమ్మ సీపీఎం జిల్లా నాయకుడు కాకు వెంకటయ్యతో కలిసి సమావేశ మందిరంలో నేలపై బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజాసమస్యల పరిష్కారానికి మూడు నెలలకొకసారి జరిపే సర్వసభ్య సమావేశాన్ని కూడా అధికార యంత్రాంగం నిర్వహించలేకపోవడం దారుణమన్నారు. భూముల రీసర్వేలో అధికారులు చేసిన పొరపాట్లతో రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. పొరపాట్లను సరిదిద్దాలని రైతులు రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోకపోవడం తగదన్నారు. రైతులు చెమటోడ్చి పండించిన పంటలకు మద్దతు ధరలు లేక రైతులు నష్టపోతున్నారన్నారు. ఉదయగిరి సామాజిక ఆరోగ్య కేంద్రంలో సరైన వైద్యం అందక పేద ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. దశాబ్దాల కాలంగా ఎదురు చూస్తున్న ఘాట్ రోడ్ నిర్మాణం ఇప్పటికీ అసంపూర్తిగానే ఉందన్నారు. ఇప్పటికైనా మండలాధికారులు స్పందించి ప్రజా సమస్య పరిష్కారానికి చొరవ చూపాలన్నారు.

నేడు డయల్ యువర్ ఆర్టీసీ డీఎం

ఆత్మకూరురూరల్: ఆత్మకూరు ఆర్టీసీ డిపోలో గురువారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు డయల్ యువర్ ఆర్టీసీ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని డిపో మేనేజరు శివకేశ్‌యాదవ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రయాణికులు తమ సూచనలు, సలహాలు, ఫిర్యాదులను 99592 25645 నంబర్‌కు ఫోన్ చేసి తెలియజేయాలని కోరారు.

కిలో పొగాకు గరిష్ట ధర రూ.341

కలిగిరి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో బుధవారం కిలో పొగాకు గరిష్ట ధర రూ.330 పలికింది. వేలానికి జనరల్ క్లస్టర్‌కు చెందిన రైతులు 640 బేళ్లను తీసుకురాగా, 480 బేళ్లను కొనుగోలు చేశారు. వేలంలో కిలో పొగాకు గరిష్ఠంగా రూ.341, కనిష్ఠంగా రూ.100, సగటున రూ.213.14 ధర పలికిందని వేలం నిర్వహణాధికారి శివకుమార్ తెలిపారు.

డీసీపల్లిలో 524 బేళ్ల విక్రయం

మర్రిపాడు: డీసీపల్లి పొగాకు వేలం కేంద్రంలో బుధవారం 524 బేళ్లను విక్రయించినట్లు వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. వేలానికి 777 బేళ్లు రాగా, అందులో 524 బేళ్లను విక్రయించామని చెప్పారు. వేలంలో కిలో పొగాకు గరిష్ఠంగా రూ.340, కనిష్ఠంగా రూ.100, సగటున రూ.205.95 ధర పలికిందని వివరించారు.

కేజీబీవీ ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

అనుమసముద్రంపేట: స్థానిక కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో ఖాళీ సీట్లకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ శ్రీలక్ష్మి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025–26 విద్యాసంవత్సరానికి సంబంధించి ఆరో తరగతిలో నాలుగు, 7,10వ తరగతుల్లో ఒక్కొక్కటి చొప్పున సీట్లు ఖాళీలు ఉన్నాయని చెప్పారు. కేజీబీవీలో చేరేందుకు ఆసక్తి కలిగిన విద్యార్థినులు సర్టిఫికెట్లను తీసుకుని తల్లిదండ్రులతో కలిసి రావాలని సూచించారు.

యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా



రాత్రి వేళ పిల్లాపేరులో ఇసుక తవ్వుతున్న జేసీబీ

వరికుంటపాడు: మండలంలోని తూర్పుబోయమడుగుల పంచాయతీ పరిధిలోని అలివేలుమంగాపురంలో పిల్లాపేరు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. రాత్రి వేళల్లో జేసీబీ, ట్రాక్టర్లతో సాయంతో పెద్దఎత్తున తరలిస్తున్నారు. ఇసుక అక్రమ రవాణాపై పలుమార్లు పోలీసులకు ఫిర్యాదు చేసినా వచ్చి చూడడమే తప్ప ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. కాగా పిల్లాపేరులోని ఇసుకను సీసీరోడ్ల నిర్మాణానికి తరలిస్తున్నట్లు గ్రామస్తులు చెబుతున్నారు. పంచాయతీరాజ్ నిబంధనల ప్రకారం సీసీరోడ్ల నిర్మాణానికి పెన్నా ఇసుకను వాడాలి. కానీ నిబంధనలను పట్టించుకోకుండా కాంట్రాక్టర్లు పిల్లాపేరులోని ఇసుకను వినియోగిస్తున్నారు. దీంతో రోడ్ల నాణ్యత దెబ్బతింటుందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని పెన్నా ఇసుకతోనే రోడ్ల నిర్మాణం చేపట్టేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

విండ్రో కంపోస్టు తయారీ మెషీన్ల ప్రారంభం



మెషీన్లను ప్రారంభిస్తున్న కమిషనర్

కావలి(అల్లూరు): కావలి ట్రంకురోడ్డులోని కంపోస్టు యార్డులో విండ్రో కంపోస్టు తయారీకి సంబంధించిన నూతన చాపింగ్, సీవింగ్ మెషీన్లను కమిషనర్ శ్రావణ్ కుమార్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ విండ్రో కంపోస్టు తయారీలో భాగంగా తడి, పొడి కొబ్బరి బోండాలు, ఇతర వ్యర్థాలను చాపింగ్, సీవింగ్ మిషన్‌ల ద్వారా పొట్టులా మార్చి సేంద్రియ ఎరువును ఉత్పత్తి చేయనున్నట్లు తెలిపారు. దీన్ని విక్రయించడం ద్వారా మున్సిపాలిటీ ఆదాయాన్ని పెంపొందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు.

విద్యుత్ మీటర్లను పునరుద్ధరించాలని వినతి



ఆర్డీఓకు వినతిపత్రాన్ని ఇస్తున్న బుడంగుంట దళిత కాలనీ వాసులు

కావలి(అల్లూరు): తొలగించిన తమ ఇళ్ల విద్యుత్ మీటర్లను పునరుద్ధరించాలని బుడంగుంట దళితవాడవాసులు కోరారు. ఈ మేరకు ఆర్డీఓ వంశీకృష్ణకు వినతి పత్రాన్ని బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా దళితకాలనీవాసులు మాట్లాడుతూ తమకు సమాచారం ఇవ్వకుండా, తాము ఇంట్లో లేని సమయంలో విద్యుత్ అధికారులు ఇళ్లపై దాడి చేసి విద్యుత్ కనెక్షన్లు కట్ చేసి మీటర్లను తొలగించి అంధకారంలో ఉంచారని ఆవేదన వ్యక్తం చేశారు. గత ఆరు సంవత్సరాలుగా ఉచిత విద్యుత్‌ను మినహాయించి వస్తున్న బిల్లులపై సమాచారం ఇవ్వకుండా లక్షలాది రూపాయల బకాయిలు ఉన్నాయని దళితవాడపై దాడి చేసి మీటర్లను తొలగించడం, సరికాదన్నారు. విద్యుత్ అధికారులు తమ వైఫల్యాన్ని కప్పిపుచ్చుకోవడానికి ఒక్కసారిగా కనెక్షన్లు తొలగించి బిల్లులను కట్టమనడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. బిల్లులు చెల్లించకపోతే స్తంభం వద్ద వైర్లను కట్ చేయాలి కానీ, ఇళ్లలోని మీటర్లను తొలగించి వైర్లతో సహా తీసుకెళ్లడం సరికాదన్నారు. విద్యుత్ మీటర్లను బిగించి బిల్లులను సులభ వాయిదా పద్ధతుల్లో కట్టించుకోవాలని కోరారు. ప్రజా సంఘాల నాయకులు భాస్కర్, దళితకాలనీ వాసులు అశోక్, లోకేష్, సాల్మన్, శివ, గణేష్, మనోవర్ధన్, రమేష్, పవన్, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విశ్వకర్మ జయంతి వేడుకలు



వీరబ్రహ్మేంద్రస్వామి మందిరంలో విశ్వకర్మ భగవానుడికి పూజలు

వింజమూరు(ఉదయగిరి): వింజమూరులోని వీరబ్రహ్మేంద్రస్వామి దేవస్థానంలో విశ్వకర్మ భగవానుడి జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. విశ్వకర్మ భగవానుడి చిత్రపటాన్ని ఏర్పాటు చేసి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం పనిముట్లను పూజించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ భాస్కరాచారి, ఎం తిరుపతాచారి, సానంపూడి రవి, తదితరులు పాల్గొన్నారు. అలాగే మండల పరిషత్ కార్యాలయంలో ఇన్‌చార్జిఎంపీడీఓ సీతారామాంజనేయులు ఆధ్వర్యంలో విశ్వకర్మ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.

ఘనంగా ప్రధాని నరేంద్రమోదీ జన్మదిన వేడుకలు



ఆత్మకూరు: ప్రభుత్వాస్పత్రిలో రక్తదాన శిబిరం



జలదంకిలో..

ఆత్మకూరు/కలిగిరి/సీతారామపురం: ప్రధాని నరేంద్రమోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని బీజేపీ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలను బుధవారం చేపట్టారు. ఆత్మకూరులోని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. అనంతరం రక్తదాన శిబిరం నిర్వహించారు. 70 మందికి పైగా యువకులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. రక్తదాతలకు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శేషారత్నం సర్టిఫికెట్లు అందజేసి అభినందించారు. అలాగే జలదంకిలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ముఖ్యఅతిథిగా హాజరై కేక్ కట్ చేసి రక్తదాన శిబిరాన్ని సందర్శించి రక్తదాతలను అభినందించారు. అలాగే కలిగిరి పీహెచ్‌సీలో రోగులకు కలిగిరి పీఏసీఎస్ చైర్మన్ కదిరి వెంకటరంగారావు రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు. అలాగే సీతారామపురం మండలం వేంపల్లితోకలోని 40 గిరిజన కుటుంబాలకు బీజేపీ నాయకులు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో బీజేపీ నాయకులు కుడుముల సుధాకర్‌రెడ్డి, కరటంపాటి సుధాకర్, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

బలరామిరెడ్డి మృతికి నివాళి



ఆత్మకూరురూరల్: వెన్నవాడ సొసైటీ మాజీ అధ్యక్షుడు పర్వతరెడ్డి బలరామిరెడ్డి మృతదేహాన్ని పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు బుధవారం సందర్శించి నివాళులర్పించారు. పార్టీ మున్సిపల్ విభాగం కార్యదర్శి అల్లారెడ్డి ఆనంద్‌రెడ్డి, ఆత్మకూరు పట్టణాధ్యక్షుడు నాగులపాటి ప్రతాప్‌రెడ్డి, తదితరులు బలరామిరెడ్డికి నివాళులర్పించి కుమారుడు మధుసూదన్ రెడ్డికి సానుభూతి తెలిపారు.

మూడు వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు

ఆత్మకూరురూరల్: బోయలచిరివెళ్ల ప్రాంతంలో జరుగుతున్న సోమశిల ఉత్తర కాలువ 42 ఆర్ ఉపకాలువ పనులను సోమశిల ప్రాజెక్ట్ 4వ డివిజన్ ఈఈ రాజశేఖర్‌రెడ్డి బుధవారం పరిశీలించారు. సోమశిల ఉత్తర కాలువ పరిధిలోని 42ఆర్ ఉపకాలువకు సంబంధించి రెండున్నర దశాబ్దాలుగా నిలిచిపోయిన పనులను తిరిగి ప్రారంభించామని తెలిపారు. బోయలచిరివెళ్ల, రావులకొల్లు, చెర్లోయడవల్లి, నెల్లూరుపాళెం రెవెన్యూ గ్రామాలకు సంబంధించి మూడు వేల ఎకరాలకు వచ్చే సీజన్‌లో సాగు నీరందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. ఆయన వెంట డీఈ మెట్టుకూరు మురళీకృష్ణారెడ్డి, ఏఈ పరమేశ్వరరెడ్డి ఉన్నారు.

రైల్వేలైన్ భూసేకరణలో అవకతవకలు సరిచేయండి

ఆత్మకూరు: నడికుడి–శ్రీకాళహస్తి రైల్వేలైన్‌కు సంబంధించి ఆత్మకూరు బైపాస్‌రోడ్డు సమీపంలో చేపట్టిన భూసేకరణలో పలు అవకతవకలు జరిగాయని, వాటిని సరిచేయాలని బాధిత రైతులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆత్మకూరు ఆర్డీఓ కార్యాలయంలో భూసేకరణలో జరిగిన పొరపాట్లను వివరిస్తూ బుధవారం వినతిపత్రాన్ని అందజేశారు. ఆత్మకూరు రెవెన్యూ అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి అవకతవకలను సరిచేయాలని కోరారు.

అల్లూరులో భారీ వర్షం



ఉదయగిరిలో కురుస్తున్న వర్షం

అల్లూరు: అల్లూరులో బుధవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. సాయంత్ర వేళ ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు చోటుచేసుకుని ఆకాశం మేఘావృతమై వర్షం కురిసింది. మండలంలో ఎడగారు వరి కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. అకాల వర్షంతో కొనిచోట్ల ఆరబోసిన ధాన్యం తడిసిపోయింది.అలాగే చేతికొచ్చిన పంట వాలిపోయి నీటిపాలవడంతో అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేశారు.

ఉదయగిరిలో మోస్తరు వర్షం

ఉదయగిరి/దుత్తలూరు: ఉదయగిరి, దుత్తలూరు మండలాల్లో బుధవారం ఓ మోస్తరు వర్షం కురిసింది. ఈ నెల మొదటి నుంచి ఎండలు వేసవిని తలపిస్తుండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు చోటు చేసుకుని వర్షం కురిసి వాతావరణం చల్లబడడంతో ప్రజలు ఉపశమనం పొందారు.

రోడ్ల నిర్మాణ పనులను నాణ్యతతో చేపట్టాలి

ఆత్మకూరురూరల్: రోడ్డు నిర్మాణ పనులను నాణ్యతతో చేపట్టాలని జిల్లా పంచాయతీరాజ్‌శాఖ ఎస్‌ఈ కోటేశ్వరరావు అధికారులను ఆదేశించారు. పట్టణంలోని అభయాంజనేయ స్వామి ఆలయం వద్ద నుంచి చేపడుతున్న ఆరులేన్ల రోడ్డు, రామస్వామిపల్లి–నల్లగొండ్ల రోడ్డు పనులను బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఆత్మకూరు బైపాస్‌రోడ్డును జనవరిలోగా పూర్తి చేయాలని అధికారులు, కాంట్రాక్టర్లకు సూచించారు. రామస్వామిపల్లి- నల్లగొండ్ల రోడ్డుకు సంబంధించి వెన్నవాడ వద్ద రైతుల అభ్యంతరాలతో తాత్కాలికంగా పనులు నిలిచిపోయాయన్నారు. భూసమస్యను పరిష్కరించిన వెంటనే వారంలోగా రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేసి మూడు మండలాల ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. పీఆర్ ప్రాజెక్ట్ విభాగం డీఈ సుధాకర్‌రెడ్డి, ఏఈలు మవేక్‌రెడ్డి, ప్రసాద్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఐవీపై అవగాహన

ఆత్మకూరు: సార్ప్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నెల్లూరుపాళెంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఐవీపై అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. హెచ్‌ఐవీ వ్యాప్తి, నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.

చేపల గుంటల పరిశీలన



చేపలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

అల్లూరు: మండలంలోని గోగుపల్లి, అల్లూరు ప్రాంతాల్లోని చేపల గుంటలను ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు హరి సాదు, ఎస్ లోకేశ్‌బాబు బుధవారం సందర్శించారు. చేపల ఎదుగుదలను పరిశీలించారు. చేపలలో ఆర్గులస్ సమస్యలను గుర్తించారు. వాటి నివారణపై రైతులకు అవగాహన కల్పించారు. ఆర్గులస్ రకాలు చేపల శరీరానికి అంటుకుని రక్తం, శరీర ద్రవాలను పీలుస్తూ గాయాలు కలిగిస్తాయని, వీటి కారణంగా చేపలు బలహీనమై ఇతర వ్యాధులకు గురవడం జరుగుతుందన్నారు. వీటి నివారణ కోసం గుంటల్లోని నీటిని తరుచుగా మార్చాలిన సూచించారు. అలాగే ఎక్టోరిడ్ ప్లస్ 400 మిల్లీ గ్రాములను వాడడం ద్వారా సమర్థవంతంగా నియంత్రించవచ్చన్నారు. గుంటల్లో జిలేబీ చేపలు అధికంగా ఉన్నాయని, వాటిని వేరుచేసి ప్రత్యేకంగా పెంచడం ద్వారా ఆదాయాన్ని పెంచవచ్చన్నారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

వింజమూరు(ఉదయగిరి)/కొండాపురం/కలిగిరి: పోషకాహారం తీసుకోవడం ద్వారా మంచి ఆరోగ్యాన్ని పొందవచ్చని సీడీపీఓ పద్మజాకుమారి తెలిపారు. వింజమూరులోని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయంలో 8వ రాష్ట్రీయ పోషణ మాసోత్సవాల సందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్తలకు పోషకాహారంపై బుధవారం అవగాహన కల్పించారు. సర్పంచ్ సుజన, అసిస్టెంట్ సీడీపీఓ చర్మిస్టా, సూపర్‌వైజర్లు తేజస్విని, షకీలా, తదితరులు పాల్గొన్నారు. అలాగే కొండాపురం మండలం తూర్పుయర్రబల్లి అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగేశ్వరి పిల్లల్లో స్థూలకాయ నివారణకు చక్కెర, నూనెలు తగ్గించడం, బాల్యదశలో సంరక్షణపై అవగాహన కల్పించారు. అనంతరం పౌష్టికాహారం గురించి బాలింతలకు, గర్భిణీలకు వివరించారు. అలాగే కలిగిరిలోని ముస్లిం అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో రాష్ట్రీయ పోషణ మాసోత్సవాలను ప్రారంభించారు.

అసత్య ఆరోపణలు మానుకోవాలి

కొండాపురం: టీడీపీ నాయకులు అసత్య ఆరోపణలు చేయడం ద్వారా తనను రాజకీయంగా దిగజార్చలేరని సత్యవోలు సర్పంచ్ పరుచూరి మాల్యాద్రి అన్నారు. బుధవారం ఆయన సత్యవోలులో విలేకరుల సమావేశం నిర్వహించారు. అగ్రహారానికి చెందిన టీడీపీ నాయకుడు గద్దే రామకృష్ణ తనపై చేసిన ఆరోపణలను ఖండించారు. తాను ఎన్నో ఏళ్లుగా వైఎస్సార్‌సీపీలోనే కొనసాగుతున్నానని తెలిపారు. సత్యవోలు పంచాయతీ అభివృద్ధికి అన్ని విధాలా కృషి చేస్తున్నామన్నారు. తనకు ప్రజల్లో ఉన్న గౌరవాన్ని చూసి ఓర్వలేక తాను టీడీపీ, జనసేనలోకి పోతున్నట్లు దుష్ప్రచారం చేయడం హాస్యాస్పదమన్నారు. తన మీద బురదజల్లే నీచ రాజకీయాలు మానుకుని చేతనైతే ప్రజలకు ఉపయోగపడే పనులు చేయాలని హితవు పలికారు. అమెరికాలో ఉండి కాకుండా ప్రజల్లో ఉండి రాజకీయాలు చేస్తే ఆదరణ ఉంటుందని ఎద్దేవా చేశారు. ఎంపీటీసీ వెంకటరమణారెడ్డి, నాయకులు చినమాలకొండయ్య, వెంగయ్య, రమేష్, లక్ష్మీనరసింహ, నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం



ఉదయగిరి: యూటీఎఫ్ రణభేరిలో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

ఉదయగిరి రూరల్/ఆత్మకూరు: కూటమి ప్రభుత్వం ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలో పూర్తిగా విఫలమైందని యూటీఎఫ్ రాష్ట్రాధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు అన్నారు. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి యూటీఎఫ్ ఆధ్వర్యంలో చేపట్టిన రణభేరి ప్రచారజాత ఆత్మకూరు, ఉదయగిరిలో బుధవారం కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు ముందు చంద్రబాబునాయుడు తాము అధికారంలోకి వస్తే ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. అధికారంలోకి వచ్చి 15 నెలలు గడుస్తున్నా ఇంతవరకు సమస్యలను పరిష్కరించకపోవడం సిగ్గుచేటన్నారు. ప్రభుత్వం వివిధ రకాల యాప్‌లను తీసుకొచ్చి ఉపాధ్యాయులతో బండచాకిరి చేయిస్తోందన్నారు. ఉపాధ్యాయులను బోధనేతర కార్యక్రమాలకు వినియోగిస్తూ పిల్లలకు చదువు చెప్పనీయకుండా చేయడం తగదన్నారు. ఉపాధ్యాయులకు డీఏ బకాయిలను వెంటనే చెల్లించాలని, 12వ పీఆర్సీని వేయాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించకపోతే దశలవారీగా ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి చలపతిశర్మ, జిల్లా గౌరవాధ్యక్షుడు కే వెంకటేశ్వర్లు, కార్యవర్గ సభ్యులు విజయ్‌కుమార్, బాలరాఘవయ్య, ఖాజావలి, గంగాధర్, మోహన్‌ప్రసాద్, మురళీధర్, తదితరులు పాల్గొన్నారు.